ప్రత్యామ్నాయ పంటలతో జీవనోపాధి

ఓ వైపు వర్షాభావ పరిస్థితులు..మరోవైపు ఏటా పెరుగుతున్న పెట్టుబడులు..తగ్గుతున్న దిగుబడులతో వరి పంట గిట్టుబాటు కాక కుదేలవుతున్న రైతులు ఆరుతడి పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. ఉద్యాన శాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ కూరగాయలు, పూలు, తదితర పంటల సాగు చేపడుతున్నారు. తద్వారా లాభాలను గడిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



కావలి రూరల్ మల్చింగ్ విధానంలో సాగుచేస్తున్న వంగతోట



చామ పంట

కావలి: కావలి నియోజకవర్గంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేయలేదు. దీంతో బోర్లు ఉన్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. కావలి రూరల్, బోగోలు,



బంతిపూల సాగును పరిశీలిస్తున్న ఉద్యాన అధికారిణి సుధామయి

దగదర్తి, అల్లూరు మండలాల్లోని రైతులు కూరగాయలు, పూలు, తదితరాలు సాగు చేపడుతున్నారు. కావలి పట్టణం పరిధిలోని మద్దూరుపాడు, కావలి మండలంలోని అన్నగారిపాలెం, పూలదొరువు, తుమ్మలపెంట, రాముడుపాళెం, రెడ్డిపాళెం, రుద్రకోట, బోగోలు మండలం చెంచులక్ష్మీపురం, నాగులవరం, ఏబీ కండ్రిగ, జక్కేపల్లిగూడూరు, సుందరగిరివారి కండ్రిగ, దగదర్తి మండలం దామవరం, అల్లూరు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో బోర్ల కింద మిర్చి, బెండ, దొండ, వంగ, కాకర, బీర, చామదుంప, ఆకుకూరలు, తదితర పంటలను సాగుచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 500 ఎకరాలకుపైగా కూరగాయలు సాగవుతున్నాయి. వీటితో పాటు కనకాంబరం, బంతి, చామంతి, మల్లె, గులాబి, తదితర పూలతోటలను సాగు చేస్తున్నారు. రెండు, మూడు నెలల్లోపు దిగుబడులు చేతికి వస్తుండడం, ఎరువులు, పురుగు మందుల ఖర్చు తక్కువగా ఉండడం, కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు కూరగాయల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. ఉద్యాన శాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ విస్తార్ణంలోనే కూరగాయాలు సాగుచేస్తూ లాభాలను గడిస్తున్నారు. తద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారు.

కూరగాయల సాగుకు రాయితీలు

హైబ్రిడ్ కూరగాయల సాగుకు ఎకరాకు రూ.6వేల వరకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలు అందిస్తున్నాం. బంతి, రోజా పూల సాగుకు ఎకరాకు రూ.6,400 రాయితీని అందజేస్తున్నాం. ఒక్కో రైతుకు గరిష్టంగా 2.5 ఎకరాల వరకు రాయితీని మంజూరు చేస్తున్నాం. రక్షిత వ్యవసాయ పథకం కింద షేడ్‌నెట్, పాలీహౌస్‌ల నిర్మాణం కోసం 50 శాతం రాయితీ ఇస్తున్నాం. ఈ షెడ్‌లలో మిరప, కూరగాయలు, పూలు తదితర నార్లు పోసుకోవచ్చు. 30 నుంచి 40 రోజులకు నాణ్యమైన నారు అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల రైతులకు సమయం, అధిక ఖర్చు ఆదా అవుతుంది. గ్రామ రైతు సేవా కేంద్రం, మండల ఉద్యాన శాఖ అధికారులను కలిసి రైతులు రాయితీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– సుధామయి,
ఉద్యానశాఖ అధికారిణి, కావలి

చామగడ్డ సాగే ఆధారం



కౌలుకు ఎకరా తీసుకుని చామ గడ్డలు సాగు చేస్తున్నా. చామగడ్డల సాగే కుటుంబానికి ఆధారం. మార్కెట్లో చామ గడ్డల ధరల్లో మార్పులు వస్తే మాత్రం జరుగుబాటుకు కష్టంగా ఉంటోంది.

–పోలయ్య, రైతు, అన్నాగారిపాలెం,
కావలి మండలం

బంతిపూలతో కుటుంబ పోషణ



ఆరెకరాలో బంతి పూలను సాగు చేస్తున్నా. కుటుంబం మొత్తం కలిసి సాగు పనులు చేసుకుంటాం. పూల ధరలు బాగుంటే కుటుంబ జరుగుబాటుకు సరిపోతుంది. పూల ధరలు బాగా తగ్గితే మాత్రం కొంచెం ఇబ్బందిగా ఉంటుంది.

–రామయ్య, రైతు,
రాజువారిచింతలపాలెం

క్లుప్తంగా

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

అల్లూరు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అల్లూరులోని బీసీ కాలనీలో ఉన్న పోలేరమ్మ చెట్టు వద్ద మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పోలేరమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

డీఎస్పీకి సన్మానం

ఆత్మకూరు: ఆత్మకూరు నూతన డీఎస్పీ కే వేణుగోపాల్‌తో పాటు సీఐ జీ వేణుగోపాల్‌ను పట్టణానికి చెందిన పలువురు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీకి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, నాయకులు జేపీ ప్రసాద్, డీ భాను, కిరణ్, కరిముల్లా, రాఘవేంద్ర, తదితరులు ఉన్నారు.

256 పశువులకు గాలికుంటు టీకాలు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లె పశువైద్యశాల పరిధిలోని తోటలచెరువుపల్లె, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో పశువైద్యసిబ్బంది 256 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను బుధవారం వేసినట్లు పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ తెలిపారు. మూడేళ్ల నిండిన పశువులకు ఉచితంగా టీకాలను వేస్తున్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను వాహనదారులు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

బీఎల్వోలకు శిక్షణ



అల్లూరు: మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు మండలంలో కొత్త ఓటర్ల చేర్పులు, చనిపోయిన ఓటర్ల తొలగింపు, సవరణలను చేపడుతున్నట్లు తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికి తిరిగి పక్కాగా చేపట్టాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల సరిహద్దుల గుర్తింపు, రేషనలైజేషన్‌ను చేపట్టాలన్నారు. నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పక్కాగా చేపట్టాలి



చేజర్ల: మండలంలో ఓటరు సర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ ఏవీ రమణారావు సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు ఓటరు సర్వేపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలో కొత్త ఓటర్ల చేర్పులు, మృతి చెందిన ఓటర్ల తొలగింపు, ఇతర సవరణలను చేపట్టాలన్నారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎరుకుల సేవా సంఘ మండలాధ్యక్షుడిగా శీనయ్య



సంగం: స్థానిక ఎస్టీ కాలనీలో ఎరుకుల సేవా సంఘ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ఎస్ శివ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ మండలాధ్యక్షుడిగా శీనయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం శీనయ్యను జిల్లా అధ్యక్షుడు ఎస్ శివ సన్మానించి అభినందనలు తెలిపారు. మండలంలో సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని ఎరుకుల కులస్తుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. ఎరుకుల కులస్తులలో అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు కట్టా రమణయ్య, చైర్మన్ కట్టా రామారావు, జిల్లా కార్యదర్శి బండి బుజ్జయ్య, నాగరాజు, యువజన విభాగం సెక్రటరి కట్టా నాగేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్

అల్లూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు ఇచ్చిన పిలుపు మేరకు అల్లూరులో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా యవజన సంఘ నాయకుడు ఎల్లు సాల్మాన్‌రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు అనుకూలంగా మార్చుకుని మాల, మాదిగల మధ్య చిచ్చురేపే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎస్సీలు ఎప్పటికి రాజ్యాధికారం వైపుగా అడుగులు వేయకుండా చేసేందుకు రిజర్వేషన్ల మంట పెడుతున్నాయన్నారు. మాదిగ సోదరులకు కావల్సింది క్రిమిలేయర్ విధానం కాదని, వాళ్లకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు, నాణ్యమైన వైద్యం, తదితర సౌకర్యాలు కల్పించకుండా అన్నదమ్ముల మధ్య చిచ్చురేపుతున్నారన్నారు. దీన్ని గమనించి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న యువజన సంఘ నాయకులు

మాల, మాదిగ సోదరులు అన్నదమ్ముల్లా ఐకమత్యంతో ముందుకుసాగాలని కోరారు. సంఘ నాయకులు ముసలి నరేంద్ర, దానం మాల్యాద్రి, డాక్టర్ వేణుగోపాల్, అరగల రమణయ్య, కలిచేటి వెంకటేష్, బుట్టి అవినాష్, జీవన్‌పాల్, డీ వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ ప్రత్యేక గ్రామసభలు

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీపై శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి గ్రామసభల నిర్వహణపై బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ఉపాధి కూలీలకు వారి హక్కులు, పనుల మంజూరుపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులపై చర్చించి తీర్మానాలు చేపట్టాలనిసూచించారు. ప్రతి పంచాయతీకి నోడల్ అధికారిగా మండలాధికారులను నియమిస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం గ్రామసభలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి ఏపీఓ శిరీష పాల్గొన్నారు.

చేజర్ల/చిట్రగుంట: ప్రభుత్వ ఆదేశాల మేరకు బోగోలు, చేజర్ల మండలాల్లోని అన్ని పంచాయతీల పరిధిలో ఉపాధి హామీపై శుక్రవారం గ్రామసభలు



ఆత్మకూరురూరల్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

నిర్వహించనున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు వెంకట సుబ్బారావు, విజయలలిత బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అవసరమైన కొత్త పనులను గుర్తించి గ్రామసభల్లో తీర్మానించనున్నట్లు వివరించారు.

వేరుశనగ పంట పరిశీలన

మర్రిపాడు: మండలంలోని పొంగూరులో సాగులో ఉన్న వేరుశనగ పంటను జిల్లా వ్యవసాయాధికారిణి పీ సత్యవాణి మంగళవారం పరిశీలించారు. రసీం పీల్చే పురుగులు ఉన్నట్లు గుర్తించి లీటరు నీటికి 0.3 గ్రాముల అసటమాప్రైడ్ మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం గ్రామసభలో పాల్గొన్నారు. ప్రభుత్వం బీడు భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు సమాలోచన చేస్తోందని తెలిపారు. వీఆర్వోలు, వీఏఏలు సంయుక్తంగా గ్రామంలోని పంటలు సాగుచేయని పంట పొలాలు, బీడు భూములను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కౌలు రైతులు పంట బీమా, బ్యాంకు రుణాల కోసం సీసీఆర్ కార్డులు తప్పకుండా పొం



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

దాలన్నారు. వారి వెంట ఏడీఏ సరోజ, మండల వ్యవసాయాధికారి రామ్మోహన్, వీఏఏలు పెంచలయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంబశివ ట్రస్టు చేయూత

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం పంచాయతీ పరిధిలోని కొట్టాల ఎస్సీ కాలనీలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి చేయూతనందించారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న విషయం తెలుసుకుని వారి రవాణా చార్జీల నిమిత్తం రూ.45వేలు నగదును ఎంఈఓ జ్యోతి చేతుల మీదుగా ఉపాధ్యాయులకు బుధవారం అందజేశారు. ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు తొమ్మిది నెలల పాటు విద్యార్థుల కోసం ఆటోను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పరమేశ్వరరెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



ఎంఈఓ జ్యోతి చేతుల మీదుగా చెక్కు అందజేస్తున్న పరమేశ్వరరెడ్డి

అక్రమంగా మట్టి తవ్వకాలు

సోమశిల: అనంతసాగరం మండలంలో మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ్ముళ్లకు అడ్డు చెప్పే వారే లేకుండా పోవడంతో యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులకు సమాచారం అందించిన ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఒక జేసీబీ, ఆరు ట్రాక్టర్లతో మట్టి తరలిస్తుండగా మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకుని ఫొటోలు తీయడంతో అప్పుడు మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు అనుమతుల కోసం వెళ్లారు. మండల రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తు నుంచి బయటకు వచ్చి ప్రకృతి వనరులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. :

గాలికుంటు నివారణకు ఉచితంగా టీకాలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ రఘునాథ్

అనుమసముద్రంపేట: పశువులకు గాలికుంటు నివారణ టీకాలను ఉచితంగా వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ రఘునాథ్ తెలిపారు. మండలంలోని చిరమన, రాజవోలు, ఏఎస్‌పేటలోని పశువైద్యశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు వ్యాధులు సోకకుంటే పాలు అధికంగా ఇస్తాయని తెలిపారు. పశువులకు గాలికుంటు సోకితే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అందువల్ల రైతులు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం



బస్టాండ్ సెంటర్‌లో మహిమలూరు కాలువ వంతెన కింద నిల్వ చేరిన మురుగు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. జాతీయ రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోయి దర్శనమిస్తోంది. మురుగు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న మహిమలూరు కాలువ వంతెన కింద మురుగు నిల్వ చేరి దోమలకు ఆవాసంగా మారింది. దీంతో చీకటిపడితే బస్టాండ్ సెంటర్‌లో నిలబడే పరిస్థితిలేదని గ్రామస్తులు వాపోతున్నారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు సైతం మురుగు నుంచి వెలువడుతున్న దుర్గంధాన్ని తట్టుకోలేక ముక్కులు మూసుకుంటున్నారు. పంచాయతీ పాలకవర్గం తక్షణమే స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి వద్ద బుధవారం లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఆత్మకూరు నుంచి వస్తున్న కారు డీసీపల్లి వద్ద లారీను ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

ఏఎస్‌పేట పీహెచ్‌సీలో భద్రత కరువు

- మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలు
- భయం గుప్పెట్లో వైద్య సిబ్బంది

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సిబ్బందికి భద్రత కరువైంది. వైద్యశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో మహిళా సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీకి స్థానికులతో పాటు దర్గాకు వచ్చిన భక్తులు సైతం చికిత్స నిమిత్తం వస్తుంటారు. రాత్రి వేళలో దర్గాకు వచ్చిన మానసిక రోగులు సైతం వైద్యశాల ప్రాంగణంలో సంచరిస్తూ ఉంటారు. గత కొన్నేళ్ల క్రితం పీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి మరమ్మతులకు గురై పనిచేయడం లేదు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులకు సిబ్బంది పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. వైద్యశాల అభివృద్ధి కమిటీ సైతం మరమ్మతులకు చొరవచూపడం లేదు. దీనికి తోడు



మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలు

వైద్యశాలకు వాచ్‌మెన్ సైతం లేదు. దీంతో రాత్రి వేళల్లో మహిళా సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల కోల్‌కత్తాలో రాత్రి వేళ విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన జరిగిన నేపథ్యంలో పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు, సిబ్బంది మానసికంగా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని వైద్యసిబ్బంది కోరుతున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

మర్రిపాడు: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఐద్వా మండల నాయకురాలు మూలి ప్రమీల ఆధ్వర్యంలో మర్రిపాడులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినులు బుధవారం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మూలి ప్రమీల మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం అత్యంత హేయమన్నారు. దోషులను ప్రభుత్వాలు వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలపై దాడులు పునరావృతం కాకుండా దోషులకు వెంటనే శిక్షలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

కలిగిరి: మండలంలోని చంద్రారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేద పండితులు నారాయణం వెంకటరమణ దీక్షితుల ఆధ్వర్యంలో పంచగవ్య ఆరాధన, జలాధివాసం, నిత్య హోమం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.



జలాధివాసం నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

సీతారామపురం/ఉదయగిరి: సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో బుధవారం చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. సీతారామపురం మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నారాయణప్పపేటకు చెందిన యువకుడు చెన్నారాయుడు నడుచుకుంటూ వెళ్తుండగా ఓ ఆటో ఎదురుగా వచ్చి ఆగింది. అదే సమయంలో ఆటోను వెనుకగా బుల్లెట్ బలంగా ఢీకొంది. దీంతో ఆటో ముందున్న చెన్నారాయుడుకు తగిలి చేయి, కాలు విరిగింది. క్షతగాత్రుడ్ని స్థానికులు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

బైక్‌లు ఢీకొని...

ఉదయగిరి మండలం గుడినరవ సమీపంలో బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. రవీంద్ర అనే వ్యక్తి ఉదయగిరి నుంచి గుడినరవకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అలాగే వరికుంటపాడు మండలం కొత్తపల్లికి చెందిన రమణయ్య, ఫణీంద్ర ద్విచక్ర వాహనంపై ఉదయగిరి వస్తున్నారు. గుడినరవ సమీపంలో రెండు బైక్‌లు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొనడంతో రవీంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. రమణయ్య, ఫణీంద్రకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కావలి : బాలికలు ఆరోగ్య జాగ్రత్తలను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని వెంగళరావునగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రమ్య సూచించారు. ముసునూరులోని ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ సుజాత అధ్యక్షతన బాలికా ఆరోగ్యంపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. లోక్ ఆదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బాలికలు రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలికలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమ్య